



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు

స్టోన్ ప్లాంటేషన్‌ను పూర్తి చేయండి

నందవరం విఆర్ఒపై చర్యలు - కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పెండింగులో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను శనివారం నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అన్ని మండలాల రీ సర్వే అంశం పై జిల్లా డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొదటి విడతలో 60 గ్రామాలకు రీసర్వే చేశామని, రెండవ విడతలో 18 గ్రామాలు రీసర్వే చేశామని తెలిపారు. ఇప్పుడు మూడవ విడత కింద 160 గ్రామాలు రీసర్వే చేయాలని లక్ష్యాన్ని కేటాయించామని తెలిపారు. ప్రణాళికా బద్ధంగా పని చేసి ఈ లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రతి రోజు మండల స్థాయి సిబ్బంది అందరూ ఫీల్డ్‌లో ఉన్నారా లేదా అని పరిశీలించడంతో పాటు ఒకవేళ ఎవరైనా సెలవులో ఉంటే వెంటనే ఇన్‌చార్జిలను నియమించి పనులను పూర్తి చేసేలా చూడాలని కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్‌కు సంబంధించి రోజువారీ లక్ష్యాలు నిర్దేశించామని, లక్ష్యాలను సాధించకపోతే చర్యలు తప్పవన్నారు. పెండింగ్ లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ కూడా శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ సమయం లోనే కరెక్షన్స్, మ్యుటేషన్స్ పనులు పూర్తి చేసుకోవాలన్నారు...జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో ఎక్కువ శాతం మార్పులు, చేర్పులకు సవరణ చేయాల్సి వస్తే విఆర్ఒ, విలేజ్ సెక్రెటరీ ల మీద చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు రీ సర్వే పనులకు సంబంధించి సాధించిన పురోగతి తీవ్ర అసంతృప్తి కలిగించిందన్నారు.. సమావేశానికి గైర్హాజరైన నందవరం విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రీ సర్వే ప్రక్రియ పురోగతిపై మండలాల వారీగా సమీక్షిస్తూ, పెండింగ్ లో ఉన్న భూహక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ కి సంబంధించి ఒక రోవర్‌కు ఒక టీమ్ ఉంటే 100 ఎకరాలు, అదే 2 టీమ్స్ ఉంటే 160 ఎకరాలు చేయాలని నిర్దేశించారు. రెండు రోవర్లు ఉంటే 200 ఎకరాలు చేయాలని చెప్పారని, కానీ ఎవరూ కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం లేదని, ఇప్పటినుండి నిర్దేశించిన లక్ష్యాలను సాధించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ మధుసూధన్ రావు, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, సర్వే ఎడి విజయ సారథి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

సమ్మెలోకి క్లాప్ డ్రైవర్లు

చెత్తసేకరణ ఆటోల నిలిపివేత - ప్రదర్శన కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. పున్నమి గెస్ట్ హౌస్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా చేశారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, వీక్లీఆఫ్‌లు అమలు చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోనికి తీసుకోవాలని, పని భద్రత కల్పించాలని, ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. క్లాప్ ఆటోలను నిలిపివేసి సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి మారెళ్ల రామాంజనేయులు (విజయ్), సిఐటియు న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. కష్టపడి పని చేస్తున్నన్న క్లాప్ డ్రైవర్లకు 3 నెలల నుండి 9 నెలల వరకు జీతాలు ఇవ్వలేదన్నారు. ఒకనెల జీతం ఇచ్చి రెడ్డి ఏజెన్సీ వారు క్లాప్ డ్రైవర్ల అప్పుదారులను మేల్కొల్పారని తెలిపారు. పెండింగు జీతాలు పూర్తిగా ఇవ్వకుండా కార్మికుల కుటుంబాల జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శించారు. రెడ్డి ఏజెన్సీ వారు పెండింగ్ జీతాలు ఇవ్వక పోగా అలాగే ప్రభుత్వంతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్లకు రూ.18,500, ఇఎస్ఐ, పిఎఫ్, వీక్లీ ఆఫ్‌లు, పని భద్రత కల్పించాలన్నారు. నిబంధనలు పాటించకుండా రెండేళ్ల కాలం నుండి క్లాప్ డ్రైవర్ల జీతంలో కట్ చేస్తున్నారు. కానీ వారి అకౌంట్లో వేయడం లేదని తెలిపారు. కార్మికులకు వీక్లీ ఆఫ్ అగ్రిమెంటులో ఇవ్వాలని ఉన్న ప్రభుత్వ సంస్థలలోనే అమలు చేయక పోవడం బాధాకరమన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వీటి కోసం ఉద్యమిస్తున్న కార్మికులపై రెడ్డి ఏజెన్సీ వారు పెండింగ్ జీతాలు అగ్రిమెంట్ అమలు చేయకుండా కార్మికులను పనిచేయాలని వేధిస్తున్నారన్నారు. మా కడుపులుకొట్టి వైసిపి ప్రభుత్వ పెద్దలు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పొట్టలు నింపుకుంటున్నారన్నారు. అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ,హెల్త్ ఆఫీసర్ కె.విశ్వేశ్వర్ రెడ్డిలు ధర్నా కార్యక్రమం దగ్గరకు వచ్చి క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు అగ్రిమెంటులో ఉన్న ప్రకారం దశలవారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ జీతాలు సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని అధికారులకు సిఐటియు నాయకులు తేల్చి చెప్పారు. సిఐటియు ఓల్డ్ సిటీ ఆఫీస్ బేరర్స్ రామకృష్ణ, నాగస్వాములు, మైమూద్, రవి, న్యూ సిటీ సిఐటియు ఆఫీస్ బేరర్స్ సుధాకరప్ప, యేసు రాధాకృష్ణ, రఫిక్, సిఐటియు ఓల్డ్ సిటీ న్యూ సిటీ కార్యకర్తలు, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

సిపిఎస్, జిపిఎస్ రెండూ ప్రమాదకరమే...

- నేటి నుంచి వరుస నిరసనలు ఫ్యాప్టో

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన జిపిఎస్ , సిపిఎస్ విధానాలు రెండు ప్రమాదకరమైనవని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కె.ప్రకాశ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హృదయ రాజు, జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్పలు పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక సలాంఖాన్ ఎస్‌టియు భవన్లో ఫ్యాప్టో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 22న ఉద్యోగులు ఉపాధ్యాయులు తమ విధులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలన్నారు. 23న సాయంత్రం తాలూకా కేంద్రాలలో నిరసన ప్రదర్శన చేయాలన్నారు. ఈనెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు హాజరై ఉద్యమకార్యాచణను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.జయ రాజు, ఎస్‌టియు నాయకులు టికె. జనార్ధన్, ఎపిటిఎఫ్ 1938 నుండి ఎస్. ఇస్మాయిల్ ,ఐ మరియానందం, ఎపిటిఎఫ్ 257 నుండి ఎం.రంగన్న ,హెచ్ఎంఎ నుండి వై నారాయణ, శ్రీనివాస్ యాదవ్ అప్టా నుండి ఆర్ సేవాలాల్ నాయక్ బిటిఎ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరులో శుక్రవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరిస్తామని అన్నారు.

ఎర్రమట్టి కొండల్లో అధికారపార్టీ దందా

- అధికారుల అండ -ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ మండలం ఎర్రమట్టి కొండలలో విలువైన మట్టిని తరలించడంలో వైసిపి కార్యకర్తలు దందా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.1000 నుండి రూ.2000 వరకు అమ్ముకొని సొమ్ము చేసుంటున్నారు. ఈ కొండల్లో ఒక బండి మట్టి తెచ్చుకోవాలంటే అధికారులను, పోలీసులను అడగాల్సిన పరిస్థితి నెలకొంది. అదీ కూడా కొంత ముట్టజెప్పితే సరే అని, లేదంటే వైసిపి కార్యకర్తలను కలవాలని సామాన్యులను



మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక్కడే గత వారంలో విచిత్ర సంఘటన చోటుచేసుకొంది. జనసేన, ముస్లిం యూత్ సభ్యులు కలిసి రోడ్లకు మట్టితో మరమ్మతులు చేస్తామని ముందుకొచ్చారు. అందుకు రెవిన్యూ, పోలీసులు ససేమిరా అంటూ దూయబట్టి నిరాకరించారు. ఏదీ ఏమైనా మండలంలో ఎర్రమట్టి అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయని, అడిగేనాథుడు కరవయ్యారు.

గొప్ప సంఘసంస్కర్త గురజాడ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కెవిఆర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

గురజాడ వెంకట అప్పారావు గొప్ప సంఘసంస్కర్త అని కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ప్రమీల అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్, డాక్టర్ ప్రమీల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీ జనోద్ధరణ కోసం పాటుపడిన గురజాడ అడుగుజాడలు నేటికీ మార్గ దర్శనంగా నిలుస్తాయన్నారు. సంఘ సంస్కరణ దృక్పథంతో సాహిత్య సృజన చేసిన చైతన్య మూర్తి గురజాడ అప్పారావు అని కొనియాడారు. సాహిత్యాన్ని ఆయుధంగా చేసి నాటి సమాజాన్ని చైతన్యవంతం చేసే దిశగా కృషి చేసిన నిత్య స్మరనీయుడు గురజాడ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ. సత్యనారాయణ. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వి.వింధ్యవాసిని దేవి కళాశాల అధ్యాపకులు రాము దాసరి, జీ.మురళీధర్, ఆర్. ఆదినారాయణ రెడ్డి, జి.శ్రీనివాస్, రాజ్ కుమార్, డాక్టర్ ధర్మేందర్, డాక్టర్ దివాకర్ ,డాక్టర్ రోశన్న పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : నవయుగ వైతాళికుడు గురజాడ వేంకట అప్పారావు అని కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి అన్నారు. కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో గురజాడ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జీవితాంతం భాష కోసం, వ్యక్తి, సంఘ సంస్కరణల కోసం నిరంతరం శ్రమించిన మహాకవి గురజాడ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.ప్రమీల, దండెబోయిన పార్వతి, డాక్టర్ లత, జయ సుశీల, మణికంఠ, మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

నేడు జిల్లాలోకి యుటిఎఫ్ ప్రచార జాత

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని యుటిఎఫ్ చేపట్టిన ప్రచార జాత శుక్రవారం కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తుందని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు పేర్కొన్నారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ నుండి ప్రారంభమయ్యే ప్రచార జాత కోడుమూరు మీదుగా కర్నూలు చేరుకొని అనంతరం ఓర్వకల్లు పాణ్యం మీదుగా నంద్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జిల్లాలో జరుగుతున్న ఈ ప్రచార జాత కార్యక్రమంలో పెద్ద ఎత్తున యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రచార జాతకు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రచార జాతాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను యుటిఎఫ్ నాయకులను కార్యకర్తలను వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు మారెప్ప, జిల్లా నాయకులు నవీన్ పాటి పాల్గొన్నారు.

19వ రోజు ఎస్ఐ పరీక్షకు 591 మంది ఎంపిక

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



పోలీసు నియామక పక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన పురుష , మహిళా అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి 2 వ బెటాలియన్ లో 19 వ రోజు దేహ దారుఢ్య పరీక్షలలో విజయం సాధించి మెయిన్స్ పరీక్షకు 591 మంది ఎంపిక అయ్యారని రాయలసీమ రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్ తెలిపారు. ఈ దేహాదారుఢ్య సామర్థ్య పరీక్షల పర్యవేక్షణకు కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్ , కర్నూలు ఎస్‌పి జి. కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్, కడప జిల్లా అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ తుషార్ డుడి పర్యవేక్షించారు. 1,096 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 1096 లో 1004 మంది పురుష అభ్యర్థులు , 92 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. వారికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఫిజికల్ మెజంˆమెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిం చారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 997 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 767 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో 767 అభ్యర్థులు పాల్గొన్నారు. 481 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్ లో 767 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 547 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మొత్తంగా ఈరోజు మెయిన్స్ పరీక్షకు 591 మంది అర్హత సాధించారు.

ప్రజాస్వామ్యం కావాలంటే టిడిపి రావాలి : భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



టిడిపి మేనిపెస్టో వివరిస్తున్న టిజి.భరత్

రాష్ట్రంలో ప్రజాస్వామ్య ఉండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని 52వ వార్డు పరిధిలోని సాయి బాబా సంజీవ నగర్‌లో ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. వారి సమస్యలు తెలుసుకొని టిడిపి సూపర్ 6 పథకాలు వివరించారు. భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వం ఉంటే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రజల జీవితాలు మారతాయన్నారు. కర్నూల్లో తాను గెలిస్తే ప్రజలకు మంచి పాలన అందిస్తానని తెలిపారు. తనకు ఓటువేసి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బొల్లెద్దుల రామకష్ణ, నాగన్న, శ్రీనివాసులు, ప్రసాద రావు, వెంకటేష్, శంకర్, గోపి, శాంతప్ప, పద్మావతమ్మ, ఉషా రాణి, షబీర్, సత్యనారాయణ, సత్యం, హనుమంతప్ప, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

కర్నూలు నగరంలోని 35వ వార్డు మాదిరాజు నగర్‌లో ఎ.గోవిందు ఇంటిపై నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని స్థానిక ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప మాట్లాడారు. జనం నివాసం ఉంటున్న ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల దాని నుండి వచ్చే రేడియేషన్ కారణంగా చిన్నపిల్లలు వృద్ధులు బాలింతలు నిండు గర్భిణీలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. అనేక రకాల జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కరోనా నిఫాలాంటి కొత్త కొత్త వైరస్‌ల వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారని తెలిపారు. ఇంటి యజమాని స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రజలను బలిచేయడం సరికాదని వారు తెలిపారు. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలందరూ ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు .తక్షణమే సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ కు, కలెక్టర్ ఆఫీసులోనీ డిఆర్ఒ మధుసూదనరావులకు వినతిపత్రం ఇచ్చారు. ధనరాజు, ఆంజనేయులు, సునీల్ కుమార్, దానం, బుడ్డన్న, మధుబాబు, ప్రతాప్,నాగమణి, చంద్రకళ, కనకలక్ష్మి, ఫాతిమా, హేమలత, గోవిందమ్మ, సాలమ్మ, మార్తమ్మ ,లీలావతి,కాలనీ ప్రజలు హాజరయ్యారు.

పార్కింగ్ సౌకర్యం లేకుండానే

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బంగారు షోరూంలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :కర్నూలు నగరంలోని పాత బస్టాండ్‌లో అనేక బంగారు దుకాణాలు ఉన్నాయి. వాటికి తోడు కొత్తగా పలు కార్పొరేట్ బంగారు షోరూంలు పుట్టుకొస్తున్నాయి. వాటిలో అనేక వాటికి కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా ఉండటం లేదు. షోరూం ప్రారంభించడానికి కావాలసిన అన్ని అనుమతులూ పాటిస్తున్నారా?.. అంటే ప్రశ్నార్థకమే. ఈ షోరూంలకు పార్కింగ్, లేబర్ లైసెన్స్, అగ్నిమాపక శాఖ అనుమతి వంటి అనేక అనుమతులు కావాల్సి ఉంది. కానీ అధికారులు తూతూ మంత్రంగా చూసి అనుమతులు ఇచ్చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. బంగారు దుకాణాల్లో తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు కూడా నామమాత్రమే. కార్మిక చట్టం ప్రకారం ఏ షోరూంలోనైనా 8 గంటలే పని చేయాలి. కానీ కార్పొరేట్ షోరూంలలో 12 నుంచి 14 గంటల వరకూ పని చేయిస్తున్నారు. చాలా షోరూంల వద్ద పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. షోరూముల వద్ద కొన్ని చదరపు అడుగులు పార్కింగ్ కోసం కేటాయించాల్సి ఉంది. చాలా షోరూములు ఇవేవీ పాటించడం లేదు. తాజాగా ప్రారంభానికి సిద్ధమైన పిఎంజె జువెల్స్ షోరూముకు పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో కొనుగోలుదారులకు పార్కింగ్ సమస్య తలెత్తనుంది. గురువారం షోరూం వద్దకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ వాహనం కూడా షోరూం బయట ప్రధాన ద్వారం పక్కనే పార్కింగ్ చేసి ఉండటం గమనార్హం.



ప్రారంభానికి సిద్ధమైన పిఎంజె జువెల్స్ షోరూం

విద్యుత్ లైన్ల సమస్యపై 1912కు ఫోన్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : విద్యుత్ లైన్ల సమస్య ఉంటే వినియోగదారులు వెంటనే 1912 కు ఫోన్ చేసినట్లయితే సమస్యను పరిష్కరిస్తారని టెక్నికల్ అండ్ హెచ్ఆర్‌డి డైరెక్టర్ ఎన్‌విఎస్. సుబ్బరాజు చెప్పారు. గురు వారం విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా కర్నూలు నగరానికి వచ్చానని ఈ సందర్భంగా అధి కారులతో రివ్యూ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రధానంగా 24 గంటలు కరెంట్ సరఫరా విషయంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా చూడాలన్నారు. వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలకు విద్యుత్తు మీటర్లను ఇవ్వాలన్నారు. ప్రైవేటు వినియోగదారుల బకాయిలు ఉన్నట్లయితే వారికి విద్యుత్ సరఫ రానునిలిపి వేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యా లయాల బకాయిలను వసూలు చేసే క్రమంలో నోటీసులు ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. ఎటిపి మిషన్లు చెడిపోయిన వాటిని వెంటనే రిపేరు చేయించి వినియోగం లోకి తీసుకు రావాలని అన్నారు. ఎప్పటికప్పుడు వర్క్ ఆర్డర్లు, పెండింగ్ లేకుండా చూసు కోవాలన్నారు. 22 సబ్ స్టేషన్లలో ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించే దిశగా ఉద్యోగులు పనిచేయాలని ఆదేశించారు. ఈ సమా వేశంలో ఎస్ఇ ఎం.ఉమాపతి, ఎస్ఎఒ చిన్న రాఘవులు, పట్టణ , గ్రామీణ ఇఇఎస్ రమేష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హెచ్ఆర్‌డి డైరెక్టర్ ఎన్‌విఎస్. సుబ్బరాజు



కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : మేయర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ బివై. రామయ్య పేర్కొన్నారు. గురువారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్ అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ పరిగణలోకి తీసుకొని కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ అయిన కార్మికులకు వారి పిల్లలకు అవకాశం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు కూడా వర్తింపజేయాలని, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. అనంతరం మేయర్ స్పందిస్తూ ఈ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నగర పాలక సంస్థలో కూడా అనేక మందికి ఎన్నో రకాలుగా సహాయం చేశామని గుర్తు చేశారు. అర్హత ఉండి ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో పేర్లు నమోదు కాని వారి పేర్లు కూడా నమోదు చేయించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారి జరదొడ్డి రమేష్, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాసిన్ బేగ్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రంగ, నగర కోశాధికారి ఈ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మైపర్ లో బేసిక్ లైఫ్ సపోర్ట్ పైన వర్క్ షాప్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మదర్ తెరిసా ఫార్మసీ కళాశాలలో గురువారం బేసిక్ లైఫ్ సపోర్ట్ పైనకిమ్స్‌హాస్పిటల్ సౌజన్యంతో కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు సిపిఆర్ చేయడం ద్వారా, గోల్డెన్ పీరియడ్‌లో సిపిఆర్ చేయ డంతో గుండెను నార్మల్ పరిస్థితికి తీసుకురావడంతో ఎంతో విలువైన ప్రాణా న్ని కాపాడవచ్చన్నారు. విద్యార్థులకు డెమోన్‌స్ట్రేషన్ చేసి కొందరు విద్యా ర్థులతో ప్రాక్టీస్ చేయించి వారికి అవగాహన కల్పించారు. కిమ్స్ డాక్టర్ వి.మురళీకృష్ణ , డాక్టర్ కె శ్రీ రాఘవ పాల్గొని విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'జలజీవన్'తో తీరనున్న నీటి కష్టాలు

- గోనెగండ్లకు రూ.2.50 కోట్ల నిధులతో పనులు - ఎంపిపి నసురుద్దీన్


భూమి పూజ చేస్తున్న ఎంపిపి, సర్పంచి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గత దశాబ్దాల కాలంగా వేసవి వస్తే తాగునీటి కోసం ప్రజలు పడే కష్టాలు ఇక నుంచి ఉండదని ఎంపిపి నసురుద్దీన్, సర్పంచి హైమావతి తెలిపారు. గురువారం దాదాపు రూ.2.50 కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ పథకం కింద గోనెగండ్లలోని చింతలముని దేవాలయం సమీపంలో నూతన నీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోనెగండ్లలో ప్రజలు తాగు నీటి కోసం వేసవిలో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇకపై ప్రజలకు జలజీవన మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ ఉచిత కుళాయి ఇచ్చి నీటి కష్టాలు తొలగిస్తామని చెప్పారు. గోనెగండ్ల మేజర్ పంచాయతీలో శివాలయం వద్ద 1, చింతలముని స్వామి దేవాలయం దగ్గర 1, రజక వీధిలో 1 మొత్తం 3 ఓవర్ హెడ్ ట్యాంకులు, స్థానిక ఎస్ఎస్ ట్యాంకు వద్ద రెండు అదనపు ఫిల్టర్ బెడ్లు నిర్మించనున్నామని అన్నారు. మాజీ కో ఆప్షన్ సభ్యులు టి.బందే నవాజ్, అడ్వకేట్ చంద్రశేఖర్, కటికే మాబువలీ, నద్దిముల్లా, ఖాజా పటేల్, కౌలుట్లయ్య, ఓబులయ్య, మదీనా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన

- వైద్యాధికారి జమీల్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి


రోగులను పరీక్షిస్తున్న విశ్వ భారతి ఆస్పత్రి వైద్యులు

చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం కర్నూలు విశ్వభారతి డాక్టర్లు చంద్రశేఖర్, వీరేంద్ర, ప్రీతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించిందని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జమీల్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలానికి చెందిన 80 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వీరిలో ముగ్గురికి క్యాన్సర్ నిర్ధారణ అయిందన్నారు. పదిమందికి ప్రారంభ దశలో ఉందన్నారు. ఇలాంటి పరీక్షల వల్ల ప్రజల్లో చైతన్యం వచ్చి క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకుంటారన్నారు. రోగులకు గర్భాశయ, ఊపిరితిత్తులు, రొమ్ము, నోటికి సంబంధించి వచ్చే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యపరంగా పురుషులు, మహిళలు అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఏ రోగమైనా ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి ఎఎన్ఎంలు, ఆశాలు సహకరించారన్నారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ కృష్ణ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరును కరువు మండలంగా ప్రకటించాలి

- ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరును కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం అగ్రహారం, కురువల్లి గ్రామాల్లో రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జులై, ఆగస్టు నెలల్లో సరైన వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన పత్తి, వేరు శనగ, ఆముదం, ఉల్లి, సద్ద తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అరకొర పండిన పంటలను జింకలు, పురుగులు పడి పంట నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టారని, పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఈ ఏడాది మండలంలో సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువ నమోదైందని చెప్పారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సర్వేలు చేసి ఎకరాకు రూ.30 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోడానికి ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆలూరు మండలాన్ని కరువుగా ప్రకటించాలని ఈ నెల 25న తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతులు హనుమంతప్ప, ఆంజనేయ, వీరేష్, శివ పాల్గొన్నారు.


ఆముదం పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

'అసైన్‌మెంట్' ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

పేదలకు సాగు భూములపై హక్కు కల్పిస్తున్నామనే సాకుతో దళిత, బడుగు, బలహీన వర్గాలు, పేదల దగ్గర ఉన్న భూములను పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం అసైన్‌మెంట్ చట్ట సవరణ ఆర్డినెన్స్ బిల్లును రద్దు చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం వ్యకాస జిల్లా కమిటీ పిలుపు మేరకు తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల అనుభవంలో ఉన్న భూములను ఇతరులకు విక్రయించుకోవచ్చన్న చట్ట సవరణ ద్వారా పేదల భూములు రియల్ ఎస్టేట్, రాజకీయ పెద్దల చేతుల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టసవరణపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలు, వ్యకాస డిమాండ్ చేయగా ప్రభుత్వం కొన్ని నిబంధనలతో ఈ సవరణను ఆమోదించాలని అధికారులకు సూచించిందని తెలిపారు. చట్టసవరణను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిసిఎల్ ఏ నిబంధనల ప్రకారం ఎవరైతే ప్రభుత్వ భూములు సాగు, అనుభవంలో ఉన్న వారి పేర్లను బహిరంగంగా సచివాలయం దగ్గర మొదటి దశలో ప్రదర్శించాలని కోరారు. ఆర్‌డిఒ, జెసి ద్వారా విచారణ చేపట్టి హక్కులు కల్పిస్తామన్న మాటలు క్షేత్రస్థాయిలో జరగడం లేదని తెలిపారు. చాలా భూమి కొంతమంది పెద్దల చేతుల్లో ఉందని చెప్పారు. సచివాలయాల్లో భూముల అనుభవదారుల పేర్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయం తీసుకొని చట్ట సవరణను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు అశోక్, రంగన్న, కుమార్ పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ మారస్వామికి వినతిపత్రం అందజేశారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ, రైతుసంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, వ్యకాస మండల నాయకులు రామాంజనేయులు, వెంకటేష్, రవి, బాలు, వీరేష్, మల్లి పాల్గొన్నారు.


దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు

ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి సూచించారు. ఆదోనిలోని ఆర్‌టిసి కాలనీ-2 సచివాలయ పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలూ సేకరించడంతోపాటు వారికి ఉన్న సమస్యలు నమోదు చేసి అక్టోబర్ 5న నిర్వహించే వైద్య శిబిరంలో పరీక్షలు చేయించాలన్నారు. ఇందిరా నగర్ మెడికల్ ఆఫీసర్ రవళి యాదవ్, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, ఇందిరా నగర్ ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ భూములు, వంక పొరంబోకు స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే తొలగింపు ముమ్మరం చేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని రాయనగర్ వద్ద ప్రవహిస్తున్న వంక స్థలంలో ఏర్పాటు చేసుకున్న కట్టడాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే తొలగించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదోనిలో ఇప్పటికే అక్రమ కట్టడాలు గుర్తించి పలువురికి నోటీసులు ఇచ్చామన్నారు. సరైన సమాధానం రాకపోతే వాటిని కూడా త్వరలో తొలగిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా ఇనుప కంచెలు వేసినట్లు తెలిపారు.

యుపిఎస్ఎఫ్ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

- ఆలూరు నియోజకవర్గ అధ్యక్షులు నరేష్ ఆచారి

ప్రజాశక్తి - ఆస్పరి

యూనిటెడ్ ప్రయివేట్ స్కూల్స్ ఫెడరేషన్ 3వ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయలని యుపిఎస్ఎఫ్ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షులు నరేష్ ఆచారి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 2న కోనసీమ జిల్లా అమలాపురంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవానికి ప్రతి స్కూల్ యాజమాన్యం తరలి రావాలని కోరారు. చిన్న స్థాయి ప్రయివేట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

మానవత్వం చాటిన మల్లెల గ్రూప్స్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో వినాయక నిమజ్జనంలో భాగంగా దారి వెంట వెళ్లే భక్తులకు మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు బిస్కెట్లు, నీళ్లు, మజ్జిగ, రస్నా ప్యాకెట్లు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీతారామయ్య మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో ఇలాంటి మానవత్వం కలిగిన మనుషులు ఉండడం వల్ల, ఈ ప్రాంతం ప్రశాంతతకు నిదర్శనంగా ఉందని తెలిపారు. డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు 'మన మతం, మన తత్వం మానవత్వం' అనే నినాదంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేయాలని ఆకాంక్షించారు. వినాయక కేంద్ర మండలి సభ్యులు కూడా ఆల్ఫ్రెడ్ రాజు సేవలను అభినందించారు. ముస్లింలు ఇస్మాయిల్, ఎంపిజె రాష్ట్ర నాయకులు ఎల్ఎండి.ఖాదర్, ప్రజాసంఘాల నాయకులు వసుంధర, పరశురామ్, అజిత్, మల్లికార్జున, మల్లెల గ్రూప్ సభ్యులు సతీష్, సామ్యేలు, జోసెఫ్, గోవిందు పాల్గొన్నారు.


భక్తులకు బిస్కెట్లు, నీళ్లు, మజ్జిగ, రస్నా అందిస్తున్న ఆల్ఫ్రెడ్ రాజు

త్వరలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

- వేగవంతంగా ప్రభుత్వ భవనాలు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు - సర్వసభ్య సమావేశంలో ఎంపిపి గిరిజమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామాల్లో తాగునీటి సదుపాయం, రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఎంపిపి వై.గిరిజమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మణిమంజరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఈ నెల 30 నుంచి 15 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసిన తర్వాత జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వైద్యాధికారుల ద్వారా వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడమే కాకుండా కాన్పులు చేయడం అభినందనీయమని చెప్పారు. నెలకు 20 కాన్పులు చేస్తున్నారని, గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కోరారు. కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాగునీటి పైపు లైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో మండలంలో సచివాలయ భవనాల నిర్మాణాల్లో భాగంగా 20కి గాను 18 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని, 10 పూర్తయ్యాయని తెలిపారు. 25 ఆర్‌బికెలు ఉండగా 4 పూర్తయి 1 ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని చెప్పారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు 19 మంజూరు కాగా 8 నిర్మాణంలో ఉండగా 3 పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉపాధి ద్వారా రూ.60 లక్షల నిధులు మంజూరవుతాయని, ఆర్‌డబ్ల్యుఎస్‌కు రూ.30 లక్షలు, పంచాయతీ రాజ్ శాఖకు రూ.30 లక్షలు కేటాయించి, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి, సిసి రోడ్లు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గిరిజమ్మ

వాస్తవాలు తెలుసుకుని ఎమ్మెల్యేను విమర్శించాలి

- వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి గత చరిత్ర మరిచి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని విమర్శిస్తున్నారని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సి.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం అభివృద్ధి చేస్తున్నందుకే మూడు సార్లు గెలుపించుకున్నారని తెలిపారు.

నూతన విద్యావిధానంతో ప్రభుత్వ విద్య నాశనం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

నూతన విద్యా విధానంతో ప్రభుత్వ విద్య నాశనం అవుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రంగప్ప ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం జ్యోతిబసు భవనంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పోతురాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రస్తుత విద్యా వ్యవస్థ-విద్యార్థులపై ప్రభావం' అంశంపై 23న ఆలూరులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యావిధానంలో సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానాన్ని (ఎన్ఇపి) తీసుకొచ్చిందని తెలిపారు. దాని పర్యవసానాలు రాష్ట్ర విద్యా రంగంలో స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు మహేష్, జగదీష్ పాల్గొన్నారు.

'నవోదయ' ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



మండలంలోని బన వాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్‌గా ఈ.పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను మొదటిగా 1992లో బీహర్‌లోని నవోదయ దర్బంగా (1992-1995)లో పిజిటి జీవశాస్త్రం ఉపాధ్యాయులుగా పని చేశానని తెలిపారు. 1995 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ నవోదయలో పిజిటి జీవశాస్త్రం ఉపాధ్యాయులుగా పని చేశానని చెప్పారు. తర్వాత 2014 నుంచి 2023 వరకు చిత్తూరు జిల్లా జవహర్ నవోదయలో వైస్ ప్రిన్సిపల్‌గా పని చేసినట్లు తెలిపారు. ఇప్పుడు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టామని చెప్పారు. విద్యాలయ అధ్యాపకుల సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా దేవాలయ సహాయ కమిషనర్ వాణి మాట్లాడారు. ఈరన్న స్వామికి రూ.84,30,289 నగదు భక్తులు చెల్లించుకున్నట్లు తెలిపారు. నగదుతో పాటు బంగారం 10 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, వెండి 15 కిలోల 620 గ్రాములు వచ్చిందన్నారు. పాలకమండలి ఛైర్మన్ ఆర్.నాగరాజ్ గౌడ్, సభ్యులు రాంప్రసాద్, సూపరింటెండెంట్లు రామ్మోహన్, వెంకటేష్, మల్లికార్జున, సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE : ADONI
E.P.132/2018 IN O.S.241/2017

Between:
C. Uligappa. ...Decree-holder
VS
U. Chandrasekhar. ...Judgement-debtor

SALE

Whereas the Decree-holder in the above E.P. has brought the E.P. schedule property for sale and the above E.P. is posted to 3-10-2023 for sale of the E.P. schedule property. The intending bidders may come and participate in bid in the auction, which will be held on 3-10-2023 between 10.30 a.m. to 5 P.m, before the hon'ble court.

Schedule

Landed property situated within R.D. of Kurnool, S.R.D. of Adoni, in Madire village, with the following particulars:
Survey no.463-A palki Ac.1.00
[undivided share of J.Dr.]

Boundaries:
East : land of D.Hanumanthu
West- land of Narasimhappa in the same survey number and remaining land of Narasimhulu
North : land of Devarinti Yenkanna
South : land of D. Hanumanthu
D.Hr. value- Rs.2 lakhs
Amin value - Rs.6 lakhs

K. ABDUL RASHEED,
D. SAVITHA RANI,
ADVOCATES FOR D.HR.
ADONI

బహిరంగ ప్రకటన

యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా, హర్వనహల్లి రాజశేఖర్, తండ్రి. హెచ్.లక్ష్మన్న, ఇంటి నెం. 8-3-976/381, ఫ్లాట్ నెం. ఎఫ్1. శ్రీసాయి కుటీర్, శాలివాహన నగర్, ఎల్లారెడ్డిగూడ, ఖైరతాబాద్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073 నివాసము ఉండే వీరు 25-03-1991 సం॥ము షెడ్యూలు దాఖలా ప్లాటును షేషిమామ్ వస్తాన్ హకీమ్ రజాక్ మియ్య, తండ్రి. లేట్. పి.వి.డబ్ల్యు, అబ్దుల్ లతీఫ్ సాహెబ్, ఇంటి నెం. 38/14 అనకలపేటవీధి, నంద్యాల గ్రామం, నంద్యాల మండలం, కర్నూలు జిల్లా, వారి నుండి విక్రయ దస్తావేజు (డాక్యుమెంట్ నెం. 1322/1991) ద్వారా తీసుకోవడం జరిగినది. అయితే దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం. 5737/1982 ను అతను హైదరాబాద్ నుంచి కర్నూలుకు బస్సులో ప్రయాణించే సమయములో పోగొట్టుకోవడం జరిగినది. క్రింద తెలిపిన షెడ్యూలు ప్లాటు లో ఇల్లు నిర్మించడం జరిగినది. ఆ ఇంటికి మున్సిపాలిటి వారు డోర్ నెం. 86/431 కేటాయించడ మైనది. పైన తెలిపిన హర్వనహల్లి రాజశేఖర్ ఈ ఇంటిని SBI, RASMECC, KURNOOL నందు మార్టిగేజ్ చేసి HOUSING లోన్ తీసుకొనుటకు నిర్ణయించుకున్నారు. కావున దానికి సంబంధించి ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల 07 రోజుల లోపల క్రింద తెలిపిన అడ్రస్సుకు గాని లేదా సెల్ నెంబరుకు గాని తెలుపవలెను, లేని యెడల ఎటువంటి ఆక్షేపణలు లేవు అని భావించబడును.

షెడ్యూలు

కర్నూలు డి. కల్లూరు సబ్.డి. కర్నూలు సిటి మున్సిపల్ కార్పోరేషన్ నెం. 86వ వార్డు నందలి కిసాన్ నగర్, కల్లూరు గ్రామ పాలము సర్వే నెంబర్లు 624/25,625, 648, 649/2సి భూమి నందు వేయబడినటువంటి ప్లాటు నెం.18 లో నిర్మించిన ఇంటి నెం. 86/431 నకు హద్దులు.
తూర్పు: 20-21 నెంబర్లు గల ప్లాట్లు
పడమర: నెం. 16 రు ప్లాటు స్తలం
ఉత్తరం : 33 అడుగుల వెడల్పు గల ప్లాను దాఖలా కాలనీ రోడ్డు
దక్షిణం : నెం. 19 రు ప్లాటు స్తలం.
ఈ హద్దులకు లోనైన నెం. 18 రు ప్లాటు స్తలం కొలతలు. తూర్పు-పడమర : 40 అడుగులు లేక 12.1920 మీటర్లు ఉత్తర-దక్షిణం 60 అడుగులు లేక 18.2880 మీటర్లు. యా ప్లాటు విస్తీర్ణం 266.6/9 చ.గ.

కె.వెంకటేశ్వర్లు

గోనెగండ్లను ఎమ్మిగనూరు కోర్టుకు బదలాయించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోనెగండ్ల మండలాన్ని నియోజకవర్గ విభజనలో భాగంగా పత్తికొండ నుంచి ఎమ్మినూరుకు బదలాయింపు జరిగిందని, పత్తికొండ కోట కోర్టు నుంచి ఎమ్మిగనూరు కోర్టుకు మార్చాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కోరారు. గురువారం విజయవాడలో న్యాయ, శాసన వ్యవహారాలు అండ్ న్యాయ పాలన న్యాయ శాఖ, ప్రభుత్వ కార్యదర్శి గాదం సత్యం ప్రభాకర్ రావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోనెగండ్ల మండల ప్రజలు కోర్టుకు వెళ్లాలంటే పత్తికొండకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఎమ్మిగనూరు కోర్టుకు మార్చాలని కోరారు.

వాలంటీర్ దారుణ హత్య

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని మండిగిరి వాలంటీర్‌గా పని చేస్తున్న హరి బాబు (25) దారుణ హత్యకు గురయ్యారు. గురువారం తెల్లవారుజామున ఈ సంఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శివ నారాయణ స్వామి, సిఐ విక్రమ్ సింహ సంఘటన స్థలానికి వెళ్లి హత్యకు దారి తీసిన కారణాలను దర్యాప్తు చేపట్టారు. మృతుడు వాలంటీర్ హరి తలకు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి హతమార్చినట్లు తెలుస్తోందని, హత్యపై ఆరా తీసేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని డీఎస్పీ శివ నారాయణ స్వామి వివరించారు. హత్యకు గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. అర్ధరాత్రి ఇంటి దగ్గర బాత్‌రూమ్‌కు అని వెళ్లాడని, ఎంతసేపటికీ రాకపోవడంతో వెళ్లి చూస్తే దారుణ హత్య గురయ్యాడని బంధువులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతుని తల్లి రోధిస్తున్న తీరు అందరినీ కన్నీరు తెప్పించింది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందాడని ఆమె విలపించారు.


దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

బాబు కోసం రక్తం చిందిస్తాం

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

- టిడిపి ఆధ్వర్యంలో దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కోసం రక్తం చిందిస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. బాబు అరెస్టును నిరసిస్తూ గురువారం ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో 9వ రోజూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ కురువ సోదరులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. 'బాబు కోసం మేము సైతమ'ంటూ తెలుగు యువత రాష్ట్ర నాయకులు బసాపురం వెంకటేష్ రక్తంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు 'బాబుతో నేను' అని పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని 500 పోస్టు కార్డులు పోస్టు చేశారు. గురవయ్య స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చి వారి ఆటపాటతో మద్దతు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, డాక్టర్ సురేంద్రబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి దీక్ష కూర్చున్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని పీటీ వారెంట్లు ఇచ్చినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటికి వస్తారన్నారు. కోర్టులో జరిగిన వాదోపవాదాలను ప్రపంచం మొత్తం చూస్తోందని, చంద్రబాబు రిమాండ్ ఎంత అక్రమమో ప్రజలు తెలుసుకుంటున్నారని అన్నారు. తప్పుడు పనులు చేసిన వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారన్నారు. బత్తిని కుబేర్ నాథ్, కొలిమి వెంకటేష్, వెంకన్నపేట మల్లికార్జున, నాగలాపురం లింగన్న, మధిర ఎల్లప్ప, దిబ్బనకల్ లక్ష్మన్న, నాగనాథనహల్లి నరసప్ప, సంతేకుడ్లూరు శేషప్ప, హానవాలు సిద్ధ లింగ, శాంత కుమార్ దీక్షల్లో కూర్చున్నారు. నాయకులు నలగదొడ్డి లోక్‌నాథ్, తిరుపాల్, కురువ ఎల్లప్ప, నాగప్ప, రామస్వామి, మాబాష, మల్లికార్జున, రంగస్వామి నాయుడు, బుద్ధారెడ్డి, బాలాజీ, విరుపాక్షి, సదుల్లా, రామాంజి, బడే సాబ్, బిచ్ అంజనప్ప, నరసింహులు, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, బసవరాజు, ఉరుకుంద మద్దతు తెలిపారు.

దీక్షల్లో ముస్లిం మహిళలు : టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష శిబిరం 9వ రోజుకు చేరింది. దీక్షలో ముస్లిం మహిళలు కూర్చుని సంఘీభావం తెలిపారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, షేక్షావలీ, కారుమంచప్ప, ఫక్కీరప్ప ఉన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ సమీపంలో 9వ రోజూ రిలే దీక్షలు కొనసాగాయి. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలకు చెందిన బీసీ, ఎస్సీ, మైనార్టీ నాయకులు కూర్చున్నారు. రిలే దీక్ష శిబిరం వద్ద చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని 'నేను సైతం బాబు కోసం' అని సంతకాల బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డుపై 'విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నేను సైతం బాబు కోసం' అని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు రక్తంతో రాశారు. టిడిపి ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షులు సుందరరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు, నందవరం నాయకులు బాలరాజు, నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములు, గోనెగండ్ల నాయకులు రహంతుల్లా, బేతాళ బడే సాబ్, రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, శ్రీధర్ నాయుడు, రంగస్వామి నాయుడు, రమేష్ నాయుడు, అచ్చుగట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, పూజారి చంద్రశేఖర్, చిన్న నేలటూరు నాగన్న, ఉప సర్పంచి ఖాసీం, లింగందిన్నె నాయుడు, వినోద్ పాల్గొన్నారు. **మంత్రాలయం**లో 'మేము సైతం' అంటూ ముస్లిం, మైనారిటీలు పదో రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించి సంబరాలు చేసుకుంటున్న వైసిపి నాయకులకు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. దీక్షలకు మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్, దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబా, జిల్లా కార్యదర్శి అబ్దుల్ రహ్మాన్, వగరూరు అబ్దుల్ సాబ్, కోసిగి ఖలందర్ సాబ్, గౌస్, ఉసేన్ సాబ్, బెళగల్ ఉసేనితో పాటు దాదాపు 100 మంది సంఘీభావం తెలిపారు. సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, ధని, తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన స్వామి, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ గౌడ్, విజయ రామిరెడ్డి, చిన్నతుంబళం వీరేష్ గౌడ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టేప్ప గారి నరసింహ, మేకల నరసింహులు, గవిగట్టు ఈరయ్య, చిన్నభూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, చిన్న ఈరయ్య, ప్రభాకర్ రెడ్డి, గుండేష్, వగరూరు పవన్ కూమర్ రెడ్డి, గోపాల్, కంబాలదిన్నె శీను, ఎస్సీ సెల్ నాయకులు మారెప్ప, ఏబు పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు


మంత్రాలయంలో మాట్లాడుతున్న గోపాల్ రెడ్డి

22న యుటిఎఫ్ ప్రచార బైక్ యాత్ర

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 22న పత్తికొండలో ప్రారంభమయ్యే ప్రచారయాత్రను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప కోరారు. గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. యుటిఎఫ్ 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు ఒకటి, అనంతపురం జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకు రెండో ప్రచార యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. హిందూపురంలో ప్రారంభమయ్యే ప్రచారయాత్ర 22న జిల్లాలోని పత్తికొండలో ప్రవేశించి కోడుమూరు, కర్నూలులో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ఈ రెండు ప్రచార జాతాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తాయని తెలిపారు. ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి మేధావులతో చర్చించి చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారనున్న జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రచారయాత్రలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శులు ఎస్.దావీదు, నరసింహులు, దేవపాల్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లారి నాగరాజు, మండలాల బాధ్యులు కె.శివకుమార్, చంద్రపాల్, ఎం.రాజు, పెద్దారెడ్డి, కె.లక్ష్మన్న, ఎస్.విజయ్ కుమార్, వై.రామాంజనేయులు పాల్గొన్నారు. **కోసిగి** మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మికాంతరెడ్డి, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా మండలంలోని అన్ని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నాగరాజు, నాయకులు పెద్దారెడ్డి, లక్ష్మన్న, శంకరయ్య, బి.నాగరాజు, పాలాగి, దానమయ్య, చిన్నవీరన్న, శాంతన్న, అయ్యస్వాములు, అమర్ నాథ్ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి





ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ఎండుతున్న మెట్ట పంటలు

- వర్షం కోసం రైతన్నల ఎదురుచూపు
- బనగానపల్లె మండలంలో 40 శాతం మాత్రమే సాగు



వర్షాలు లేక పెరగని కంది పంట



ఎండిపోతున్న కంది కొర్ర పంట

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆరుగాలం కష్టపడే రైతులు ఏటా అతివృష్టి, అనావృష్టితో నష్టపోతునే ఉన్నారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఇటీవల అరకొర వర్షాలు పడినా పూర్తిస్థాయిలో అదను కాకపోవడంతో 15 రోజులకే రైతులు సాగు చేసిన కంది, కొర్ర పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో 45 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్‌లో 24,250 ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలో ఇప్పటివరకు 10,250 ఎకరాల్లో మాత్రమే పంటలను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కటికవానికుంట, ఫతేనగరం, పసుపుల, పెద్దరాజుపాలెం, చిన్నరాజుపాలెం, క్రిష్ణగిరి, చెర్లో కొత్తూరు, జోలాపురం, పాతపాడు, మీరాపురం, యాగంటి పల్లె, యనకండ్ల ఎర్రగుడి, హుస్సేనాపురం, రామకృష్ణాపురం, రాళ్ల కొత్తూరు తదితర గ్రామాలలో కంది 3405 ఎకరాలు, కొర్ర 375 ఎకరాలు, పత్తి 450 ఎకరాల్లో వర్షాధారం కింద రైతులు పంటలను సాగు చేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 65.3 మి.మీ గాను 42.8 మి.మీ, జూలైలో 106.3 మి.మీ గాను 99.4, ఆగస్టులో 116.4 మి.మీ గాను 62.8 మి.మీ వర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షం కురవడంతో రైతులు ఖరీఫ్‌లో సాధారణ సాగు కంటే తక్కువగా సాగు చేశారు. దీనికి తోడు ఎస్ఆర్‌బిసి కాల్వకు నీరు రాకపోవడంతో కాల్వ కింద రైతులు పంటలు సాగు చేయలేదు. సెప్టెంబర్ నెలలో ఒక మోస్తరు వర్షాలు కురిసినా పూర్తిస్థాయిలో అదను కాకపోవడంతో వర్షం కురిసిన 15 రోజులకే పంటలు వాడుముఖం పడుతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలను సాగు చేస్తే వర్షాలు లేక ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బోర్లు, బావుల కింద రైతులు మొక్కజొన్న, పత్తి, మిరప, వరి పంటలను సాగు చేయగా బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలకు నీరందని పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాలలో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం బనగానపల్లె ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరు ఎకరాలలో కంది, మూడు ఎకరాల్లో కొర్ర పంటలను సాగు చేశాను. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పర్లపాటి నాగార్జున, రైతు కటికవానికుంట.

కరువు మండలంగా ప్రకటించాలి



మండలంలో వేల ఎకరాలలో రైతులు సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్నాయి. ప్రభుత్వం బనగానపల్లె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి. మెట్ట ప్రాంత పంటలకు ఎకరానికి రూ.30 వేలు, బోర్లు, బావుల కింద సాగు చేసి ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

- జెవి.సుబ్బయ్య, సిపిఎం మండల కార్యదర్శి.

జగన్ పతనం ప్రారంభం


- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ
- ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పతనం ప్రారంభమైందని మాజీ మంత్రి భూమ అఖిల ప్రియ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన చోటు నుండే తమ పోరాటం ప్రారంభిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఎలాంటి అవకతవలు జరగలేదని, కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే ప్రతిపక్ష నేతను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, తన సహచర మంత్రులు పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును చర్చకు రానివ్వకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారంటే ఇంత కంటే దుర్మార్గం మరొకటి ఉండదన్నారు. ఇలాంటి పాలన అవసరమా అని ప్రజలు తెలుసుకోవాలన్నారు. తక్షణమే నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జైనాబీ, నాగార్జున, ప్రముఖ న్యాయవాది, టిడిపి నాయకులు తాతి రెడ్డి తులసి రెడ్డి, భార్గవ్ రామ్, మాజీ కౌన్సిలర్లు కొండారెడ్డి, కృపాకర్, శివశంకర్ యాదవ్, చింతల సుబ్బారాయుడు, మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

29న విజయవాడలో మహాధర్నా

- జయప్రదం చేయండి : కెవిపిఎస్, వ్యకాసం



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - వెలుగోడు

ఈనెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్, ఎపి వ్యకాసం నాయకులు కోరారు. గురువారం వెలుగోడులోని సిఐటియు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. రామదాసు, వెలుగోడు సిఐటియు మండలం అధ్యక్షులు వి. నాగమోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన నేటికీ దళితులపైన హత్యలు, అత్యాచారాలు, దాడులు దళిత మహిళల పైన మానభంగాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. దళితుల అభివృద్ధి కోసం సాధించుకున్న భూ పోరాట చట్టాలను, అసైన్డ్ మెంట్ 7/99 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసి దళితుల చేతుల్లో ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడానికి ఈ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కుల వివక్షత, అంటరానితనాన్ని రూపుమాపుటకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రచార క్యాంపెయిన్ నిర్వహించి, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం ప్రకారం బడ్జెట్ లో పక్కదారి పట్టించిన నిధులను తిరిగి కేటాయించి మరలా దళితులకే ఖర్చు చేయాలన్నారు. రాష్ట్రంలో స్మశానంలో గుంతలు తీసే కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, వారికి ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రతి నెల 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులకు ప్రతి నెల 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులకు పెన్షన్ వయస్సు 40 సంవత్సరములకు తగ్గించాలన్నారు. డప్పు కళాకారుడు మరణిస్తే జీవిత బీమా సౌకర్యం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. చర్మకారులకు ప్రతి నెల రూ.4000 పెన్షన్ ఇచ్చి, పెన్షన్ వయస్సు35 సంవత్సరములకు తగ్గించాలన్నారు. దళితులకు దళిత పేటలో గ్రామాలలో స్మశానాలు లేని గ్రామాలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కెవిపిఎస్ పోరాడి సాధించుకున్న స్మశానాల జీవో నెంబర్ 1235 ప్రకారం దళితులకు రెండు ఎకరాలు స్మశాన భూమి కేటాయించాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వి.కిషోర్, పి.కృష్ణ, యల్. గౌరీ, టీ.జాషువా, ఎల్ శేఖర్, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. వెంకటయ్య, ఎస్.నబి రసూల్,ఎస్. నూరుల్లా, మోదీన్, దేవరాజు, శివకుమార్, బడేసా తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఎలుగుబంటి

- గత నాలుగు రోజులుగా సంచారం - భయాందోళనలో గ్రామస్తులు, భక్తులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో గత నాలుగు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తోంది. స్థానికులు, భక్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం రాత్రి ఎలుగుబంటి పాత వివేకానంద పాఠశాల మైదానం పరిసర ప్రాంతాల్లో ప్రత్యక్షం కావడంతో స్థానికులు కెమెరాల్లో బంధించి అటవీ శాఖ అధికారులకు చేరవేశారు. స్థానికులు కేకలు వేయడంతో ఎలుగుబంటి మళ్లీ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిది. గత కొన్ని రోజుల క్రితం ఇలాగే అటవీ ప్రాంతం నుండి క్షేత్రంలోని జనావాస ప్రాంతంలోకి ఎలుగుబంటి వస్తుండడంతో స్థానికులు, దేవస్థానం అధికారులు అటవీ శాఖకు సమాచారాన్ని ఇచ్చారు. దీంతో ఎలుగుబంటిని బంధించి అటవీ ప్రాంతంలో వదిలారు. మళ్లీ ప్రస్తుతం మూడు నాలుగు రోజుల నుంచి క్షేత్ర సమీప ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో స్థానికులతో పాటు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం వారు మైకుల ద్వారా భక్తులను, స్థానికులను తగు జాగ్రత్తలు తీసు కోవాలని, గుంపులుగా ఉండాలని సూచిస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది కూడా దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి గురువారం తీసుకుపోయినట్లు సమా చారం. బుధవారం రాత్రి మహానందిలోని అటవీశాఖ సిబ్బంది, అధికారులు దీనిపై నిఘా ఉంచారు. భక్తులకు, గ్రామస్థులకు ఎలుగుబంటి నుంచి ఎలాంటి హాని జరగకముందే త్వరగా అటవీ శాఖ అధికారులు బంధించి అడవిలోని లోపలి ప్రాంతంలో వదిలిపెట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.





మహానంది క్షేత్రం సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి



ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేస్తున్న నంది పైపుల రామచంద్రారెడ్డి

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పెండేకంటి నగర్‌లో వినాయక చవితిని పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు నంది పైపుల రామచంద్రారెడ్డి తన కుమారుడు బెడదల సందీప్ కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం బహుమతులను గురువారం ప్రదానం చేశారు. మొదటి విజేత లక్ష్మీ కళావతికి రూ.6,116 వెండి గిన్నె, రెండవ బహుమతి సువర్ణకు రూ.3,116 వెండి గిన్నె విజేత, మూడవ బహుమతి రామ లక్ష్మికు రూ.2116 వెండి గిన్నె నందిపైపుల రామచంద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ దొనపాటి యాగంటి రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, లాయర్ నాగేశ్వర రెడ్డి, పాతపాడు వెంకటేశ్వర రెడ్డి ,ఆచారి, సందీప్ కుమార్ రెడ్డి, ఫ్రెండ్స్ బన్నీ, సిద్దు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా నాగేంద్ర కుమార్



ప్రజాశక్తి - అవుకు : ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా తాలేపల్లి నాగేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని వాసవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు సమక్షంలో యువజన సంఘం అధ్యక్షుడిగా తాలేపల్లి నాగేంద్ర కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. మల్లెల సునీల్ కుమార్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో తాలేపల్లి నాగేంద్ర కుమార్‌ను ఆర్యవైశ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

23న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఆర్‌టిసి డిపో మేనేజర్ కార్యాలయంలో ఈ నెల 23న డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికులు తమ ఇబ్బందులు, సమస్యలు ఉదయం 11 నుంచి 12 గంటలు వరకు 9959225803కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని రావుస్ కళాశాలలో లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షులు పివి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ప్రపంచ శాంతి దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు హాజరై మాట్లాడారు. 2001 సంవత్సరం నుండి ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు సెప్టెంబర్ 21న ప్రపంచ శాంతి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం పాత్ర అద్వితీయమని, బుద్ధుని నుండి గాంధీ, మదర్ తెరిసా వరకు ప్రపంచంలో శాంతి స్థాపన కోసం విశేష కృషి జరిగిందన్నారు. అనంతరం 'ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం పాత్ర' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఇమ్రాన్, అఖిల్, రేహాన్‌లకు నంద్యాల లయన్స్ క్లబ్ బహుమతులు అందజేసింది. లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు ప్రపంచ శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి సోమేశుల నాగరాజు, జోనల్ చైర్మన్ చంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపల్ సుంకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన విజేతలకు బహుమతులు అందజేస్తున్న

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎపిజిబి చైర్మన్ రాకేష్ కష్యప్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ఇచ్చే వివిధ రకాల రుణాలను వినియోగదారులు, లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కష్యప్ అన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నంద్యాల ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ రాకేష్ కష్యప్‌చే రూ.5.25 కోట్లు విలువ గల వివిధ రకాల రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో గృహ, వాహన, వ్యక్తిగత, విద్య, ఆస్తి తనఖా ఋణాలు అతి తక్కువ వడ్డీతో త్వరితగతిన మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ ఉందని, ఈ అవకాశాన్ని ఎపిజిబి ఖాతాదారులు, ప్రతి ఒక్క వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి.స్వావి కుమార్, సీనియర్ మేనేజర్ బి.వంశీ కృష్ణ, సరళ ఋణకేంద్ర సీనియర్ మేనేజర్ రమేష్ బాబు, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



రుణాల మెగా చెక్కును అందజేస్తున్న చైర్మన్

ఎంబిబిఎస్ రెండో కౌన్సిలింగ్ అడ్మిషన్లు రద్దు చేయాలి

- హెల్త్ యూనివర్సిటీ అధికారులను అరెస్ట్ చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎంబిబిఎస్ కౌన్సిలింగ్‌లో తక్కువ మార్కులు వచ్చిన వారికి, ఓసిలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రిజర్వేషన్‌లో సీట్లు కేటాయించిన ఎంబిబిఎస్ రెండవ రౌండ్ అడ్మిషన్లను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా కమిటీ అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహా యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ పుల్లయ్యను ఆయన కలిసి ఎంబీబీఎస్ రిజర్వేషన్ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రెండో కౌన్సిలింగ్ ఎంబీబీఎస్ అడ్మిషన్ తక్షణమే రద్దు చేసి నష్టపోయిన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 54 వేల ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు రిజర్వేషన్ కేటగిరిలో, 60 వేల ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో సీట్లు కేటాయించిన వైస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతాలయ్య, నియోజకవర్గం కో ఆర్డినేషన్ సభ్యుడు ఫరూక్, రాష్ట్ర మైనారిటీ సెల్ కన్వీనర్ షంసుల్ హక్, జిల్లా యస్సి సెల్ అధ్యక్షులు నాగలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి చాకలి పుల్లయ్య, సిరివెళ్ళ మండలాధ్యక్షుడు పసుపులేటి లక్ష్మీ నరసింహ, నాయకురాలు స్వర్ణ సప్రవేన, రఫీ, సలాం, ఆదం తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఎంబిబిఎస్ రెండో కౌన్సిలింగ్ అడ్మిషన్లను తక్షణమే రద్దు చేసి నష్టపోయిన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బరుగొడ్ల హుస్సేన్ భాష డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ హరినాధరావుకు ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ కాంపిటీషన్‌లో ఎంబిబిఎస్ సీటు పొందేందుకు అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు ఓపెన్ కాంపిటీషన్లో కేటాయించకుండా రిజర్వేషన్ కేటగిరిలో సీట్లు పొందాల్సిన అనేకమంది దాదాపు 80 సీట్లు కోల్పోయారని చెప్పారు. అర్హులైన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం జరిగేలా రెండవ విడత నిర్వహించిన ఎంబిబిఎస్ కౌన్సిలింగ్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని తెలపాలని తహశీల్దార్‌ను కోరారు.



డిఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ తదితరులు



ఆళ్లగడ్డ : తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బరుగొడ్ల హుస్సేన్ బాషా



వినాయకుడి లడ్డును దక్కించుకున్న రామమోహన్ నాయక్

వేలంలో వినాయకుని లడ్డు రూ. 23 వేలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లి తండాలో వినాయకుడి లడ్డుకు గురువారం వేలం నిర్వహించగా రూ. 23 వేలకు సుగాలి రామమోహన్ నాయక్ అత్యధికంగా పాడి దక్కించుకున్నారు. వినాయక విగ్రహానికి మంగళవారం నుండి గురువారం వరకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాల పంపిణీ మొదలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక లడ్డు వేలం పాట ఉమ్మాయిపల్లి తండాలో మొట్టమొదటి సారి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంపాటలో సుగాలి రామమోహన్ నాయక్ రూ. 23 వేలకు పాడి దక్కించుకున్నాడు. అనంతరం నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మాయిపల్లి తండా సర్పంచి ఎస్.లక్ష్మీదేవి, కరెంటు లైన్ ఇన్స్పెక్టర్ జయ నాయక్, వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి - రుద్రవరం

రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. గురువారం మండలంలోని మందలూరు గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి 2100 ఎకరాల భూమి ఉండగా సర్వే నిర్వహించి 639 మంది రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. దీంతో రైతులకు భవిష్యత్తులో భూమికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఫక్రుద్దీన్, వైసిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఏ ఎల్లప్ప సచివాలయ సిబ్బందిగ్రామ రైతులు పాల్గొన్నారు.



జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ తాసిల్దార్ మహబూబ్ బాషా తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జిఓ 21ని రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మోటార్ వాహనాల చట్ట సవరణ జీవో నెంబర్ 21ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. నందికొట్కూరులో గురువారం నాడు అప్పి, ఆల్ఫా, బజాజ్ ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ మోటార్ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో పెంచిన ఫీజులు, పెనాల్టీలు, పెట్రోల్, డీజిల్ గ్యాస్ ఇన్సూరెన్స్, ప్రీమియం తగ్గించాలని, 15 ఏళ్ల దాటిన వాహనాలను తుక్కు కింద మార్చాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో రైతులు పండించిన పంటలు పండ్లు, కూరగాయలు, మత్స ఉత్పత్తి ,నిత్యవసర సరుకులు, ప్రయాణికులను చేరవేసే మోటర్ వాహన రంగాన్ని ప్రభుత్వం నీరుగార్చిందని వారు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నూతన చట్టాల వల్ల ఉపాధి కోల్పోయి ప్రమాదం ఉందన్నారు. మోటార్ వాహనాలపై టోల్ ట్యాక్సీలు, రోడ్డు టాక్సీలు, అధిక పెనాల్టీలు, గ్రీన్ టాక్స్ లు పెరిగాయని, తక్షణమే ఆటో కార్మికులపై ఆర్థిక భారాన్ని మోపే జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పకీర్ సాహెబ్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కే వెంకట్ రెడ్డి, శ్రీధర్, కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా కె ఈశ్వరన్న, ఆశన్న, ట్రెజరీగా పిశాలతోపాటు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు.



పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న శ్రీశైల దేవస్థానం ఇఒ లవన్న తదితరులు

వరసిద్ధి వినాయకుడికి శ్రీశైల దేవస్థానం పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం

కాణిపాకంలోని వరసిద్ధి వినాయకునికి బహ్మోత్సవాలలో శ్రీశైల దేవాస్థానం తరుపు నుండి పట్టువస్త్రాలను శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్. లవన్న, సహాయ కార్యనిర్వహణ అధికారి మోహన్, ధర్మకర్తల మండలి సభ్యులు విజయలక్ష్మి, వేద పండితులు, అర్చకులు గురువారం సమర్పించారు. కాణిపాకంలో ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న వీరికి వరసిద్ధి వినాయక దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఏ వెంకటేష్, తదితరులు స్వాగతం పలికారు. ఆ తర్వాత సంప్రదాయబద్ధంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో శ్రీశైలం పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగతోంది.



పొలాలను పరిశీలిస్తున్న దృశ్యం

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో ఆత్మకూరు మండలంలోని కరివేన, వడ్లరామాపురం, కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామంలో, వెలుగోడు మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ పంటల స్థితిగతులను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థాన శాస్త్రవేత్తలు డా.ప్రభాకర్, డా. యం శివరామ క్రిష్ణ, డా.ఆర్. నరసిహులు, సహాయ వ్యవసాయ సంచాలకులు బి. ఆంజనేయ, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పంటల సమగ్ర సస్యరక్షణపై పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సాగునీటి వనరుల లో అనుకున్నంత స్థాయిలో నీటి నిలువలేనందున రైతులు ఆరుతడి పంటలైన జొన్న, మినుము, ప్రొద్దుతిరుగుడు, ఉలువ, సెనగలు వంటి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒలు డి. విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్. పవన్ కుమార్, కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలి

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు బి రామేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్నలు డిమాండ్ చేశారు. గురువారం పాములపాడులో రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం కరువును ప్రకటించి నష్టపరిహార అంచనా చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కౌలు కార్డులతో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలన్నారు. రబీ సీజన్‌కు 90 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులు రైతులకు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య మాట్లాడుతూ వర్షాలు సరిగా లేక పంటలు లేకపోవడంతో వ్యవసాయ కార్మికులకు పనులు లేక పూట గడవని పరిస్థితి ఉందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం అదనంగా వంద రోజులు పనులు ఉపాధి కూలీలకు కల్పించి, ఆ పనులూ వెంటనే చేపట్టే విధంగా అధికారులు చూడాలని కోరారు. పని కోరిన వారికి పని చూపే విధంగా చూడాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఆర్ రమణ, బాల యేసు, చెన్నయ్య, రామకృష్ణ, రంగయ్య ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

వైసిపికి భారీ షాక్

- బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అనుచరులు 100 మంది టిడిపిలో చేరిక



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరులో వైసిపికి భారీ షాక్ తగిలింది. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రధానమైన అనుచరులపైన నందికొట్కూరు పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు జమీల్ బాషా, రసూల్ ఖాన్‌లు నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మండ్రా శివానందరెడ్డి ఆధ్వర్యంలో గరువారం టిడిపిలో చేరారు. జమీల్ బాషా, రసూల్ ఖాన్‌లు టిడిపిలో చేరేందుకు భారీ ర్యాలీ చేపట్టి మాండ్ర శివానందరెడ్డికి స్థానిక పటేల్ సెంటర్ నందు తన అనుచరులతో భారీగా స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి షేక్ మహమ్మద్ జమీల్, రసూల్ ఖాన్‌ల గృహాలలో మాండ్ర శివానందరెడ్డి తేనేటి విందులో పాల్గొన్నారు. అనంతరం మాండ్ర వారికి పార్టీ కండువాలతో టిడిపిలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నేత మండ్రా శివానందరెడ్డి మాట్లాడుతూ టిడిపి పాలనలో చంద్రబాబు నాయకుడు ముస్లిం మైనార్టీ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. నందికొట్కూరు నియోజవర్గ పరిధిలోని తమ కుటుంబం ముస్లిం మైనార్టీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉందన్నారు. వైసిపి పార్టీ ముస్లిం మైనార్టీ ప్రజలను వాడుకోవడమే తప్ప వారి సంక్షేమం కోసం పాటుపడిందేమీ లేదని విమర్శించారు. నేడు వైసీపీ నాయకుడు సిద్ధార్థ రెడ్డి నాయకుడిగా చలామణి అవుతున్నాడు అంటే అందుకు కారణం నేడు టిడిపిలో చేరిన జమీల్ బాషానేనని పట్టణ ప్రజలందరికి తెలుసునన్నారు. నిస్వార్థం నిజాయితీ గలిగిన నాయకులు జమీల్, రసూల్ ఖాన్‌లు టిడిపిలోకి రావడం గర్వంగా చెప్పుకుంటున్నా మన్నారు. నమ్మి వచ్చిన నాయకులకు వారి ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన 100 కుటుంబాల ప్రజలకు ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాతా రమేష్ రెడ్డి, గిరీశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జయసూర్య, నియోజవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు లాయర్ జాకీర్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు ముర్తు జావలి, మాజీ కౌన్సిలర్ సురేంద్ర, పట్టణ టిడిపి అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,పలుచాని మహేశ్వర్ రెడ్డి, వార్డు ఇన్చార్జి కళాకర్ ,నిమ్మకాయల రాజు, పాలమర్రి నాగరాజు, పగడం సోమశేఖర్, ప్రవీణ్ రగడ టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుట్రతోనే చంద్రబాబు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టిడిపి ఎస్టీ సెల్ నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని టిడిపి కార్యాలయం సమీపంలో ఆ పార్టీ ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరమణ నాయక్, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణనాయక్‌ల ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు 'బాబుతో నేను - బాబు గారికి తోడుగా' కార్యక్రమంలో భాగంగా టిడిపి ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నాయకులు మహిళలు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా మద్దతు తెలిపారు. సాయంత్రం దీక్షలో ఉన్న నాయకులకు, మహిళా నాయకులకు టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, పట్టణ ఉప సర్పంచి బురానుద్దీన్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, నాయకులు పసుపల బాల నాయుడు, టిప్ టాప్ కలం, అల్తాఫ్ హుస్సేన్, ఖాదర్ భాష, మంగంపేట శ్రీనివాసులు, వేములపాడు గురప్ప, తిరుపాల్ నాయక్, శంకర్ నాయక్,రాముడు నాయక్, జరుపల కృష్ణుడు నాయక్, శ్రీరామ్ నాయక్, సురేష్ నాయక్, ఎస్. అరుణ్ కుమార్ నాయక్, హనుమ నాయక్, చంద్ర నాయక్, వెంకట రాముడు నాయక్, వేణు కుమార్ నాయక్, ఈశ్వర్ నాయక్, బాలరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ నంద్యాల తహసిల్దార్ కార్యాలయం ఎదుట 9వ రోజు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో బోయ, వాల్మీకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానంద రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. దీక్ష శిబిరం వద్ద వాల్మీకి సంఘం వారికి లాయర్ రామచందర్ రావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బిసి సెల్ అధికార ప్రతినిధి గోవిందు నాయుడు, వాల్మీకి సాధికార కన్వీనర్ రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు సంజీవ కుమార్, నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం దీక్షలో కూర్చున్న వారికి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. **పాణ్యం :** బిసిల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ పుట్టిందని పాణ్యం నియోజక వర్గ ఇంఛార్జి గౌరు చరిత అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో బిసి నాయకులు రిలే నిరాహారదీక్షలు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు జయరామీ రెడ్డి, లాయర్ బాబు, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, ఖాదర్, గోపాల్ పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** వైసిపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పై కుట్ర పూరితంగా కేసులు పెట్టి అరెస్ట్ చేసిందని తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నురు రామలింగ రెడ్డి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో గురు వారం ఆత్మకూరు పట్టణంలో 9వ రోజు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో బుక్కాపురం, శ్రీనగరం, అల్లినగరం, యార్రగుంట్ల, భోదనం, జుటూరు, జి.సి పాలెం, యర్రగుడూరు గ్రామాలకు చెందిన టిడిపి శ్రేణులు చేపట్టిన దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు కేసుపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు. చంద్రబాబుకు అందరూ అండగా నిలబడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంగాల కృష్ణా రెడ్డి, మహానంది శివయ్య, మల్లేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల రూరల్ : బోయ వాల్మీకులకు భూమా బ్రహ్మా రెడ్డి

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి 25న విజయవాడలో ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-డోన్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 25న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని అంగన్వాడి వర్కర్స్ యూనియన్ డోన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.కె.నాగలక్ష్మి, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్వైజర్ పరమేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గర్భిణి, బాలింతలు, సున్నా నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు సేవలు చేస్తూ ప్రభుత్వ నిర్దేశిత ఉద్దేశాలు నెరవేర్చే దిశలో అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారని అన్నారు. అతి తక్కువ గౌరవ వేతనాలతో పనిచేస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్నా.. అంగన్వాడీల వేతనాలు మాత్రం పెరగడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా అంగన్వాడీలకు అనేక రకాలుగా వాగ్దానాలు చేశారని, తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనాలు ఇస్తానని చెప్పారు కానీ ఐదేళ్లు అవుతున్నా.. వాగ్దానాలు మాత్రం నెరవేర్చడం లేదని వాపోయారు. ఇప్పటికైనా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని,ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని, మెనూ చార్జీలను పెంచి, ప్రభుత్వమే గ్యాసును సరఫరా చేయాలని, పెండింగ్‌లోని సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు,ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని,నాణ్యమైన సరుకులు లబ్ధిదారులకు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.





స్వచ్ఛ బేతంచర్లగా చేద్దాం..

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల నగర పంచాయతీని స్వచ్ఛ నగర పంచాయతీగా అందరి సహకారంతో తీర్చిదిద్దుకోవడానికి కృషి చేయాలని బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బేతంచెర్ల నగర పంచాయతీ ప్రజలు వారి వారి వీధుల్లో.. వారివారి గృహాల దగ్గర తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ కవర్లను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సుజాత, వెంకటేశ్వర, నాయక్ ,హుసేని, రామాంజనే యులు, వెంకటేశ్వర్లు, చంటి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

ప్రజాశక్తి - వెలుగోడు



వితంతు పెన్షన్ మంజూరు చేయాలని వెలుగోడు సచివాలయం - 5 నందు అర్జీ ఇచ్చి ఇప్పటికి దాదాపు 18 నెలలు కావస్తుందని బాధితురాలు షేక్ షఫీఉన్నీసా ప్రజాశక్తితో వాపో యారు. ఆమె మాటల్లోనే నా భర్త పేరు షేక్ ఇర్ఫాన్ వలి 28వ తేది ఏప్రిల్ నెల 2022లో మరణించాడని తెలిపింది. అప్పటినుండి సచివా లయానికి ఆదాయ ధృవీకరణ సర్టిఫికేట్ లేదని, రేషన్ కార్డు సరిగా లేదని, డెత్ సర్టిఫికేట్ రాలే దని ఇలా ఒక్కొక్కసారి ఒక్కొక్క కారణంతో నాకు పెన్షన్ రావడానికి సమయం పడుతుందని అధికారులు చెప్పారు. అన్ని ధ్రువపత్రాలు మే నెలలో సచివాలయ అధికారులకు సమర్పించిన ఆన్లైన్లో నమోదు చేయలేదు. ఈ విషయంపై వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లను ప్రజాశక్తి వివరణ కోరగా పెన్షన్ రావడానికి ఇంకా సమయం ఉందని మాకు సమయం దొరికినప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తామని పొంతన లేని సమాధానం చెప్పారు. ఈ విషయాన్ని ఎంపిడిఒ అమానుల్లా వద్దకు బాధితురాలితో వెళ్లగా ఆయన అక్కడ లేకపోవడంతో చరవాణిలో సంప్రదిస్తే చరవాణి లోను ఏ విధంగాను సమాధానం రాలేదు.

భద్రత ఇవ్వలేని జిపిఎస్ వద్దు : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -ప్యాపిలి

భద్రత కల్పించలేని గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపియస్) మాకు వద్దు అని యుటిఎఫ్ ప్యాపిలి మండల శాఖ అధ్యక్షులు కృష్ణ నాయక్, ప్రధాన కార్యదర్శి నరసింహరెడ్డి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో జిపిఎస్‌ను ఆమోదించడం దుర్మార్గం అన్నారు. గ్యారంటీ అనేది పేరు లోనే ఉంది తప్ప.. వాస్తవానికి ఫించను ఇవ్వడంలో లేదని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా సిపియస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత జిపిఎస్‌తో మరో కొత్త నాటకానికి ప్రభుత్వం తెర లేపిందని దుయ్యబట్టారు. పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని యుటిఎఫ్ నాయకులు నల్ల రిబ్బన్ ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ ఆర్థిక కార్యదర్శి మధు, మండల కార్యదర్శి రాజన్న, జిల్లా కౌన్సిలర్లు బొజ్జన్న,హరి నారాయణ, లోకేశ్వరి, పాల్, మాబాషా, సాలయ్య, షరీఫ్,నాగ మద్దయ్య,నాగాంజనేయులు,శంకర్ తదితరులు పాల్గొన్నారు

పాత పెన్షన్ విధానమే కావాలి : ఎస్‌టియు

చాగలమర్రి : జిపిస్ వద్దు,సిపిఎస్ వద్దు పాత పెన్షన్ విధానమే కావాలని ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మీడియా కన్వీనర్ నాగేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ భద్రతలేని గ్యారెంటీ పెన్షన్స్ స్కీంను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టి యు మండల శాఖ అధ్యక్షుడు జి మస్తాన్ బాష, ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు ,ఆర్థిక కార్యదర్శి టి మాబుహుస్సేన్, స్టేట్ కౌన్సిలర్లు శివశంకర్ ,ప్రసాద్, జయరాజ్, జిల్లా కౌన్సిలర్లు నారాయణరెడ్డి ,రాజశేఖరరెడ్డి, శేషాద్రి ,నరసింహులు, సురేశప్ప ,మహబూబ్ బాషా ,ఐడికే శాస్త్రి ,వై శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గెలుపొందిన విద్యార్థులంతా జిల్లా స్థాయి క్రీడాలలో రాణించి, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. **కొలిమిగుండ్ల :** మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన 11 మంది బాల బాలికల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ ఎంసి వెంగయ్య, ఉపాధ్యాకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు విమలావతి ప్రిన్సిపల్,హుస్సేన్ బాష, పిఇటి రమేష్, రాజేష్ ఆకాంక్ష ఫౌండేషన్ సెక్రెటరీ తదితర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి : జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

కొత్తపల్లి : నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారని ప్రధా నోపాధ్యాయుడు వీరన్న అన్నారు. గురువారం ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు, వ్యాయమ ఉపాధ్యాయుడు సుంకన్న నాయక్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 వతేదీన నందికొట్కూరు పట్టణంలో జరిగిన నియోజకవర్గ స్థాయి అండర్ 14 ఖోఖో, 300 మీటర్ల క్రీడల్లో ప్రతిభకనబరచి శివపురం గూడెంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కె.సరస్వతీబాయి, ఏ వైష్ణవిలు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక అయ్యారన్నారు. మారుమూల అటవీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ జిల్లా స్థాయి. క్రీడాపోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. **పగిడ్యాల :** నియోజకవర్గ స్థాయిలో నందికొట్కూరులో గురువారం జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడాలో భాగంగా అండర్ 14 విభాగంలోని కబడ్డీ విజేతగా పగిడ్యాల మండల జట్టు నిలిచింది. ఈ పోటీలో విజయం సాధించిన పగిడ్యాల మండల జట్టు క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. విజేతగా నిలిచిన పగిడ్యాల జట్టు ఈ నెలలో జరుగు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



కొలిమిగుండ్ల : జిల్లా పోటీలకు ఎంపికైన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు



కబడ్డీ విజేత జట్టుతో ఉపాధ్యాయులు సిబ్బంది

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE:: NANDYAL
I.A.No. 2384/2019 IN O.S. No. 93/2010
Basineni Chenna Kesalu. ...Petitioner/Plaintiff
-Vs-
1) Gopavaram Ramatheertham Reddy and others. ...Respondents/Defendants
NOTICE TO RESPONDENT No.12 / PROPOSED DEFENDANT No. 12

పై నెంబర్ దావా యందు 8వ ప్రతివాది అయిన సంగ శివనాగిరెడ్డి చనిపోయినందున అతని వారసులను ప్రతివాదులుగా చేర్చుటకు పై అర్జిని వాది దాఖలు చేయడమైనది. సదరు వారసులను చేర్చు అర్జి నందు respondent No.12/defendant No.12 అయిన మీకు పై అర్జి నందు మీ నోటిసులకు గాను 04-10-2023వ తేదిన పై అర్జి వాయిదా ఉన్నది. కావున respondent No.12/defendant No.12 అయిన మీరు పై అర్జి యందు 04-10-2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట యందు కుద్దుగా గాని, వకీలు ద్వారా ఎదుట హాజరు అయి పై అర్జి యందు మీ యొక్క ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షంగా పై అర్జిని కోర్టు వారు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వాయిదా: 04-10-2023

S.M.Subhani,
R/o D.No. 30-49A, Beside Court Complex, Nandyal Town, Nandyal District.
K.Venkoba Rao, Cell No: 9963920866
Advocates for Petitioner/ Plaintiff, Nandyal.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.1566/2022 IN O.S.No.356/2022
V. పెద్ద జంబులన్న @ జంబులయ్య. ...పిటిషనర్
V/S
1) Y. చిన్న కొండయ్య మరియు ఇతరులు. ...రెస్పాండెంట్స్
To,
Y. చిన్న కొండయ్య,
S/o.పిచ్చయ్య,
R/o గోవిందపల్లె గ్రామం,
సిరివెళ్ల మండలం, నంద్యాల జిల్లా.
నోటీసు
పై నెంబరు కేసులో R1 (రెస్పాండెంట్)అయిన నీవు నోటీసు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 26-09-2023 వ తేదీన వేసి ఉన్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపు కొవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 26-09-2023
ఇట్లు
బి. శివప్రసాదరావు,
పిటిషనర్ తరపున న్యాయవాది,
ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No.356/2022
V. పెద్ద జంబులన్న @ జంబులయ్య. ...వాది
V/S
1) Y.చిన్న కొండయ్య మరియు ఇతరులు. ...ప్రతివాదులు
To,
Y. చిన్న కొండయ్య,
S/o. పిచ్చయ్య,
R/o గోవిందపల్లె గ్రామం,
సిరివెళ్ల మండలం, నంద్యాల జిల్లా.
దావా సమను
పై నెంబరు కేసులో D1 (1వ ప్రతివాది) అయిన నీవు సమన్లు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 26-09-2023 వ తేదీన వేసి ఉన్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 26-09-2023
ఇట్లు
బి. శివప్రసాదరావు,
వాది తరపున న్యాయవాది,
ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P. No.14/2023
1) జెట్టి సుధాకర్, S/o. బాలుడు
2) జెట్టి ప్రసాద్, S/o. బాలుడు
3) తిరువీధి చిట్టిబాబు, S/o. నాగోజీ
4) జెట్టి రామసుబ్బయ్య, S/o. సుబ్బన్న
అందరిదీ చాగలమరి గ్రామం మరియు మండలం
నంద్యాల జిల్లా. ...పిటీషనర్స్
V/S
1) వంకదార సుబ్బారావు,
@ వంకదార వెంకట సుబ్రహ్మణ్యం,
S/o.చలపతి రాయుడు,
వయస్సు 62 సంll, H.No.7-34, మెయిన్ బజార్,
చాగలమర్రి గ్రామం మరియు మండలం
నంద్యాల జిల్లా.
ఆధార్ నెం.938059404192. ...రెస్పాండెంట్
1 వ రెస్పాండెంట్ కు నోటీసులు
పిటీషనర్స్, రెస్పాండెంట్ అయిన నీపై క్రెడిటర్ I.P. దాఖలు వచ్చేసి ఉన్నందున సదరు I.P లో నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 19-10-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయంగా కాని, మీ వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షపణలు తెలిపుకోవలెను. లేని యెడల నీకు పరోక్షంగా I.P తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 19-10-2023
ఇట్లు
బి.నీలకంఠేశ్వరం,
పిటిషనర్స్ తరపున అడ్వకేట్,
ఆళ్లగడ్డ.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. NO.90/2022
పగిడేల వెంకటసుబ్బారెడ్డి.
...వాది
వర్సెస్
ఏర్వ వెంకటేశ్వరమ్మ భర్త కృష్ణారెడ్డి
H. No.1-115A, కొత్తపల్లి గ్రామం నంద్యాల మండలం
నంద్యాల జిల్లా. ...ప్రతివాదులు
ప్రతివాది కి దావ సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాది పై దావ దాఖలుచేసి ఉంది. బాండు బాపతి గాను డబ్బులు మొత్తం రాగోరి ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ. 13-10-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 13-10-2023
ఇట్లు
V. మధుసూదన్ రెడ్డి,
V. బాలు నాయక్,
వాదిపరం అడ్వకేట్స్
నంద్యాల.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. NO.92/2023
పూదూరు చంద్రమోహన్ రెడ్డి. ...వాది
వర్సెస్
భీమిశెట్టి మహేష్ కుమార్.
...ప్రతివాది
D1.భీమిశెట్టి మహేష్ కుమార్ వయస్సు 33 సంll,
తండ్రి భీమిశెట్టి తిరుపాలు c/o.భీమిశెట్టి మల్లికార్జున
r/o.శివాలయం వీధి గడివేముల గ్రామం & మండలం
నంద్యాల జిల్లా (ఇంతకుముందు కర్నూలు జిల్లా)
లేక
భీమిశెట్టి మహేష్ కుమార్ తండ్రి భీమిశెట్టి తిరుపాలు
జూనియర్ అసిస్టెంట్ ఎస్సార్. బీ.సీ, డివిజన్ నెంబర్. 3, నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా. ...ప్రతివాది
ప్రతివాది కి ఆర్డర్ 5 రూల్ 20 c.p.c. కింద దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాది పై దావా దాఖలుచేసి ఉండి ప్రామిసర్ నోటు డబ్బులు మొత్తం 3,43,600/00 రాగోరి ప్రతిపాదులు అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఆఫీసుకు మరియు ఇంటి అడ్రస్‌లకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ. 11-10-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ.11-10-2023
ఇట్లు
K. రామకృష్ణయ్య,
వాది పరం అడ్వకేట్